

28న జాబ్‌మేళా

జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న కొత్తగూడెం క్లబ్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు.

8లో



డెడ్ స్టోరేజీ స్థాయికి 'పాలేరు'

సాగర్ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరింది.

10లో

గరిష్టం/కనిష్టం
37°/19°

వాతావరణం

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది. రాత్రి వాతావరణం కొంత చల్లగా ఉంటుంది.

మున్సిపల్ సమస్యలపై నేడు 'సాక్షి' ఫోన్ ఇన్



మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

మణుగూరుటౌన్: పట్టణ వాసులను కుక్కలు, కోతుల బెడద వేధిస్తోంది. దీనికి తోడు తాగు నీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల సమస్య ఎదుర్కొంటున్న వారు ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా 'సాక్షి' సమన్వయం చేయాలని సంకల్పించింది. ఈమేరకు ఆదివారం ఫోన్ ఇన్ ఏర్పాటు చేయగా మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు పరిష్కారానికి పాటుపడతారు.

తేది : 26 - 02 - 2023, ఆదివారం,
సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఫోన్ చేయాల్సిన నంబర్
98499 09514

వీధి కుక్కలకు స్టెరిలైజేషన్



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

- కోతులు, పందుల బెడద నివారణకూ చర్యలు
- పాల్వంచ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో సమస్యలు వెల్లడించిన పట్టణ వాసులు

పాల్వంచరూరల్ : వీధి కుక్కలు, కోతులు, పందుల బెడద నివారణకు తగిన చర్యలు చేపడతామని పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అన్నారు. పుర వీధుల్లో సంచరించే కుక్కలను పట్టించి కొత్తగూడెంలోని జంతుసంరక్షణ కేంద్రానికి తరలిస్తామని, సంతాన పునరుత్పత్తి కాకుండా స్టెరిలైజేషన్ చేయిస్తామని చెప్పారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పట్టణ వాసులు పలువురు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తేగా, వాటి పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

- కేటీపీఎస్ ఇంటర్మీడియట్ కాలనీ, నెహ్రూనగర్, గోవర్ధనగిరి కాలనీల్లో కుక్కలు, పందుల సంచారం అధికంగా ఉంది. ఈ సమస్య పరిష్కరించాలి

– ఎ.సతీష్‌కుమార్, ఇంటర్మీడియట్ కాలనీ, రవి బాబు, నెహ్రూనగర్, రవీందర్‌రెడ్డి, గోవర్ధనగిరి కాలనీ, శేషు, జ్యోతినగర్, మణికుమార్, చాకలి బజారు

జవాబు : కుక్కలు, పందులు, కోతుల బెడద నివారణకు తక్షణమే చర్యలు తీసుకుంటాం. కుక్కలను పట్టుకుని వాటికి సంతాన పునరుత్పత్తి లేకుండా చర్యలు చేపడతాం. మార్చి 1 నుంచి పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టించి ఆపరేషన్ చేయిస్తాం. జనావాస ప్రాంతాల్లో పందులు తిరగకుండా చూడాలని పెంపకందారులకు గతంలోనూ చెప్పాం. మరోసారి సీరియస్‌గా హెచ్చరిస్తాం. కోతులు కూడా సంచరించకుండా పట్టుకుని అడవుల్లోకి వదిలే ఏర్పాటు చేస్తాం.

- సీతారాంపట్నం, మారుతినగర్ ఏరియాల్లోని ఖాళీ స్థలాల్లో వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ అటు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు

– ఎల్.రవికుమార్, సీతారాంపట్నం, బండి నారాయణ, శ్రీనగర్‌కాలనీ

జ : వీధిలైట్లు లేని సీతారాంపట్నం, మారుతినగర్, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో వెంటనే ఏర్పాటు చేయిస్తాం. వెంటనే ఆయా ప్రాంతాల ఎలక్ట్రీషియన్లను పంపించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. కొత్తగా స్తంభాలు వేసిన ప్రదేశంలో మాత్రం ఉన్నతాధికారుల నుంచి అనుమతి వస్తేనే సాధ్యమవుతుంది.

- గణపతినగర్‌లో డ్రెయినేజీ కొంత తీసి వదిలేశారు. దీంతో మురుగునీరు బయటకు వెళ్లడం లేదు.రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

– సురేష్‌బాబు, గణపతినగర్

జ : డ్రెయినేజీ నిర్మాణం త్వరలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

- నాలుగు రోజులుగా తాగునీరు రావడం లేదు. కుక్కలు, పందుల సంచారం అధికంగా ఉంది.

– ఎ.కృష్ణ, వనమా కాలనీ

జ : పైపులైన్ మరమ్మతుల కారణంగా తాగునీరు సరఫరా కావడం లేదు. ఆదివారం నుంచి తాగునీరు వచ్చేలా చర్యలు చేపడతాం. పందులు, కుక్కల సమస్య కూడా సత్వరమే పరిష్కరిస్తాం.

- మజీద్‌ల్లోకి కుక్కలు వచ్చి ఇబ్బంది పెడుతున్నాయి. ఈ సమస్య పరిష్కరించండి. పాల్వంచలో జంతుసంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

– ఎండీ యాకూబ్‌పాషా, దమ్మపేటసెంటర్, పాల్వంచ

జ : వీధి కుక్కలను పట్టుకునేందుకు బయట నుంచి వ్యక్తులను పిలిపించాం. మజీదుల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటాం. పాల్వంచలో జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

- పాత పాల్వంచ జెండాల వీధి, కరకవాగులో కుక్కలు, కోతుల బెడద అధికంగా ఉంది. చిన్నపిల్లలు వీధుల్లోకి రావాలంటేనే భయపడుతున్నారు.

– శేషుకుమార్, అహ్మద్ నజీర్, పాత పాల్వంచ

జ : కోతులు, కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకుంటాం. వాటిని పట్టే వారిని హైదరాబాద్ నుంచి పిలిపిస్తున్నాం. నాలుగైదు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- బాషా తండాలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– భట్టు కృష్ణ, కరకవాగు

జ : తాగునీటి సరఫరాకు సత్వరమే చర్యలు తీసుకుంటాం. డ్రెయినేజీ సమస్యను కూడా వెంటనే పరిష్కరిస్తాం.

- వెంగళరావు కాలనీలో రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి

– శ్రీనివాస్, వెంగళరావుకాలనీ

జ : కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే అన్ని వార్డుల్లో కొత్త రోడ్ల నిర్మాణం చేపడతాం.

- రిలయన్స్ మార్ట్ సందు అపార్ట్‌మెంట్ నుంచి వీధిలైట్లు వెలగడం లేదు. రాత్రివేళ ఇబ్బందిగా ఉంది. తాగునీరు కూడా రావడం లేదు

– వెంపటి వెంకటేశ్వర్లు, నెహ్రూనగర్

జ : వీధిలైట్ల సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. కిన్నెరసాని పైపులైన్ మరమ్మతులు చేపట్టాం.పనులు పూర్తి కాగానే తాగునీరు సరఫరా చేస్తాం.

- గట్టాయిగూడెంలో డ్రెయినేజీ లేక ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు కూడా సక్రమంగా లేదు.

– ప్రవీణ్, రాజేష్, గట్టాయిగూడెం

జ : మున్సిపాలిటీలో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో స్లమ్ ఏరియాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. త్వరలోనే డ్రెయినేజీ, రహదారి నిర్మిస్తాం.

- వీధి లైట్ల సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

– భూక్యా రమేష్ ,చిన్నభద్రం, వెంకటేశ్వర హిల్స్ కాలనీ

జ : నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు ఇంకా వీధి లైట్లు ఏర్పాటు చేయలేదు. పైనుంచి అనుమతులు తీసుకుని వెంటనే ఏర్పాటు చేస్తాం.

- తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నాం. ఈ సమస్య పరిష్కరించాలి. కుక్కల బెడద కూడా ఉంది

– జహీరాబేగం, బొల్లోరిగూడెం

జ : పాత పైప్‌లైన్ ద్వారా నీళ్లు రావడం లేదు. మిషన్ భగీరథ పైపులైన్ కొత్తగా వేస్తాం. ఈ సమస్య త్వరలోనే పరిష్కరిస్తాం. వీధి కుక్కలను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

వీధుల్లో కుక్కలు.. ఇళ్లపై కోతులు..

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో వీధుల్లో కుక్కలు, ఇళ్లపై కోతులతో తాళలేకపోతున్నామని పలువురు మున్సిపల్ కమిషనర్ అంకుషావలి దృష్టికి తీసుకొచ్చారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పలువురు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు.

- బస్టాండ్ ఏరియా, సాయిబాబా ఆలయం, ఇల్లెందులపాడులోని పోచమ్మ గుడి ప్రాంతాల్లో కుక్కలు విపరీతంగా ఉన్నాయి. అటుగా వెళుతున్న వారిపై దాడి చేస్తున్నాయి

– కె.రాజేందర్ 8వ వార్డు, మాడిశెట్టి రాజు, 17వ వార్డు, సతీష్, 16వ వార్డు, డి. నరహరినాయక్, ఇల్లెందులపాడు

జవాబు : పట్టణంలో గత వారం రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. దీంతో కుక్కలు ఆహారం, నీటి కోసం అల్లాడుతున్నాయి. చెట్ల కింద సేద తీరుతున్నాయి. ఆ సమయంలో అటుగా వెళ్లిన వారిని కరుస్తున్నాయి. పట్టణంలోని 300 కుక్కలను కొత్తగూడెం తరలించి ఆపరేషన్ చేయించి, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

- జేకే కాలనీలోని సింగరేణి క్వార్టర్ల వెనుక మామిడి చెట్లపై కోతులు గుంపులుగా ఉంటున్నాయి. అటుగా వెళ్లే వారిపై పడి దాడి చేస్తున్నాయి. దీంతో భయంగా ఉంది.

– కె. విజయ, కార్యదర్శి, సింగరేణి సేవా సమితి

జ : పట్టణంలో కోతుల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. 500 కోతులను పట్టి, అటవీ ప్రాంతంలోకి తరలించేలా ఇప్పటికే మున్సిపాలిటీలో తీర్మానం చేశాం. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం.



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న అంకుషావలి

- డీఆర్‌సీసీ భవన్ సమీపంలో నిర్జన ప్రదేశంలో కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి

– బి.రవినాయక్, మాజీ కౌన్సిలర్, స్టేషన్ బస్తీ

జ : మాంసం, చికెన్ షాపుల వారు వ్యర్థాలను రోడ్లపై పడేయడంతో.. ఆహారం దొరకని కుక్కలు అటువైపు పరుగులు తీస్తున్నాయి. ఫంక్షన్ హాళ్ల వారు, రోడ్లపై శుభ, అశుభ కార్యాలు చేసుకునేవారు ఎక్కడ పడితే అక్కడ ఆహార పదార్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. వారికి నోటీసులు జారీ చేస్తాం.

- కాలం చెల్లిన నల్లాలతో సక్రమంగా నీళ్లు రావడం లేదు. దీంతో ఇబ్బంది పడుతున్నాం

– జంగాల శ్రీనివాస్, 5వ వార్డు, సుధాకర్, 24వ వార్డు

జ : నల్లాలకు మరమ్మతులు చేపట్టి, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తాం. సకాలంలో తాగునీరు అందిస్తాం.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు ప్రమోద్

పాల్వంచ/కొత్తగూడెంరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడాలంటే తల్లిదండ్రుల సహకారం అవసరమని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు ప్రమోద్ అన్నారు. పాల్వంచలోని కేటీపీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అభ్యుదయ పాఠశాల, లక్ష్మీదేవిపల్లి మండలం ఇందిరానగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను శనివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ సహకరిస్తేనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. పిల్లలు కూడా చదువు పట్ల మరింత శ్రద్ధ పెట్టే అవకాశం ఉంటుందన్నారు. పిల్లల ప్రగతి ఎంటని తల్లిదండ్రులు తరచూ ఉపాధ్యాయులను అడుగుతుండాలని, అప్పుడే చిన్నారుల భవిష్యత్ బాగుపడుతుందని అన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ లక్ష్యం సాధించాలని పిలుపునిచ్చారు. ఏమైనా సందేహాలుంటే వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు హర్ష, జిల్లా సెక్టోరియల్ అధికారి నాగరాజశేఖర్, ఎంఈఓలు జంకీలాల్, ఎ.శ్రీరామ్మూర్తి, ప్రధానోపాధ్యాయులు ఎం.జ్యోతిరాణి, పద్మలత, సీఆర్‌పీలు గంగరాజు, శ్రీనివాస్, రమేష్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఇందిరానగర్ కాలనీ పాఠశాలలో మాట్లాడుతున్న ప్రమోద్

కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి అజయ్, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు



స్వామి వారిని దర్శించుకుంటున్న మంత్రి పువ్వాడ అజయ్, ఎమ్మెల్యే మెచ్చా తదితరులు

సర్కారు బడుల బాగే లక్ష్యం

- 'మన ఊరు – మన బడి'తో మెరుగైన వసతులు
- ఇంగ్లిష్ మీడియంతోపాటు మాతృభాషకూ ప్రాధాన్యం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

అశ్వారావుపేటరూరల్/అన్నపురెడ్డిపల్లి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను అభివృద్ధి చేయడంతో పాటు, నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఈ క్రమంలోనే సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా 'మన ఊరు – మన బడి' పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. అచ్యుతాపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు – మన బడి' కింద రూ.16.92లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. తమ పిల్లలు నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఆంగ్ల మీడియంలో చదవాలని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారని, అందుకోసమే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సర్కారు బడులను ఆధునికీకరిస్తూ సకల సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. మన ఊరు – మన బడి పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, గ్రీన్ చాక్‌పీస్ బోర్డులు, డిజిటల్ బోధన, సరిపడ తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీలు, ఫర్నిచర్, డైనింగ్ హాళ్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇంగ్లిష్ మీడియంతోపాటు మాతృభాషకూ సమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి అమలులో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉందని తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో జిల్లా అధికారులను పలువురు ప్రశంసించారని చెప్పారు. మొదటి విడతలో మంజూరైన 368 పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. జిల్లాను రాష్ట్రానికే మోడల్‌గా నిలిపేలా కృషి చేస్తామని చెప్పారు.

రేపటి నుంచి ఆర్టీఏ సేవలు..

అశ్వారావుపేటలో సోమవారం నుంచి ఆర్టీఏ సేవలను ప్రారంభిస్తామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మార్చి 7న స్థానిక పాత ఎంపీడీఓ ఆఫీసులో ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుపై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని అన్నారు. అంతకుముందు నారంవారిగూడెంలో గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అశ్వారావుపేట సహకార సంఘం చైర్మన్ నూతక్కి నాగేశ్వరరావు విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో డీఈఓ సోమశేఖరశర్మ, గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జెడ్పీ సీఈఓ విద్యాలత, వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, ఎంఈఓ పి. కృష్ణయ్య, సర్పంచ్‌లు యాట్ల నాగమణి, మను గొండ వెంకట నాగముత్యం, ఎంపీటీసీ సభ్యురాలు కాసాని దుర్గ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి పేరుతోనే 'సీతారామ'

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి పేరుతోనే సీతారామ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ప్రారంభించారని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అబ్బుగూడెంలో నిర్మించిన శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి మంత్రి హాజరయ్యారు. స్వామి వారి దర్శనానంతరం హోమం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద మంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బారత లాలమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'భోజనం' బాగుందా ?

అచ్యుతాపురంలో పాఠశాల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం అనంతరం మంత్రి అజయ్ కుమార్ కాసేపు ఓ విద్యార్థితో ముచ్చటించారు. బడిలో మధ్యాహ్న భోజనం బాగుందా.. ఏం కూరగాయలు పెడుతున్నారు.. ఇంటి దగ్గర తింటున్నారా.. బడిలోనే తింటున్నారా.. టీచర్లు పాఠాలు ఎలా చెబుతున్నారు ? అని ప్రశ్నించారు. ప్రతి ప్రశ్నకు విద్యార్థులు సంతృప్తికరంగా సమాధానాలు చెప్పడంతో నవ్వుతూ బయటకు వచ్చారు.

న్యూస్‌రీల్

రామయ్యకు ఘనంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, వారాంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన ఫ్లెక్సీ ఆవిష్కరణ



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఈఓ తదితరులు

భద్రాచలంటౌన్: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి ఇటీవల తయారు చేయించిన బంగారు పూత వాహనాల ప్రారంభ ఆహ్వాన ఫ్లెక్సీని ఈఓ ఎల్.రమాదేవి శనివారం ఆవిష్కరించారు. స్వామివారి వాహన సేవ కోసం ఎస్‌ఆర్‌ఐ వాసవి అసోసియేషన్ వారు రూ.65 లక్షలతో కుంభకోణంలో తయారు చేయించిన ఈ వాహన ప్రతిష్ఠకు మార్చి 2న అంకురార్పణ చేయనున్నారు. 3వ తేదీన సువర్ణ ద్వాదశ వాహన ప్రతిష్ఠ, సాయంత్రం బంగారు వాహనంపై స్వామివారి తిరువీధి సేవ, 4న సార్వభౌమ వాహన సేవ నిర్వహించనున్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు, చారుగుళ్ల శ్రీనివాస్, పాకాల దుర్గాప్రసాద్, ఎస్‌ఎస్‌వీ రామారావు, దోసపాటి వెంకటేశ్వరరావు, బండారు కృష్ణయ్య, యశోద రాంబాబు, వెంకటాచారి, సుదర్శనరావు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కకాట్లపై అప్రమత్తంగా ఉండండి

- రక్షణ చర్యలు చేపట్టండి..
- కలెక్టర్ అనుదీప్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్, విజేత

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజలు కుక్కకాటుకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. కుక్కలవృద్ధి రేటును నియంత్రించే ఆపరేషన్లు, అత్యవసర వైద్యసేవలు.. తదితర అంశాలపై శనివారం ఐడీఓసీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుక్కల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో తక్షణ చర్యలు చేపట్టి ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. సోమవారం నుంచి ఆపరేషన్లు ప్రారంభించాలని, పర్యవేక్షణకు కుటుంబ నియంత్రణ కేంద్రంలో ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. రోజుకు వంద కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో మాంసపు దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించి వ్యర్థాలను బయట వేయకుండా అవగాహన చర్యలు చేపట్టాలని సూచించారు. ఫంక్షన్‌హాళ్లు, కోళ్ల వ్యర్థాలు మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించాలని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కుక్క, కోతి కాటు మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో డీపీఓ రమాకాంత్, వైద్యాధికారులు ముక్కంటేశ్వరరావు, రామకృష్ణ, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపల్ కమిషనర్లు రఘు, శ్రీకాంత్, అంకుషావలి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

జిల్లా ఉపాధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28న కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహిస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించి ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్‌మేళా 28న ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, 8వ తరగతి నుంచి పీజీ వరకు, ఇంజనీరింగ్ ఎంబీఏ, ఎంసీఏ, ఐటీఐల్లోని వివిధ ట్రేడ్‌లు, డిప్లొమా తదితర అర్హతలు ఉన్నవారు తమ బయోడేటాతో పాటు విద్యార్హత జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని చెప్పారు. కార్యక్రమంలో వేల్పుల విజేత పాల్గొన్నారు.

హామీల అమలుపై.. ఆత్మపరిశీలన చేసుకోవాలి

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు..
- పోడు పట్టాల పంపిణీలో చిత్తశుద్ధి చూపండి
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి


చంద్రుగొండ: క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

చండ్రుగొండ: ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రం చండ్రుగొండలో ఆయన క్యాంప్ కార్యాలయాన్ని శనివారం రాత్రి ప్రారంభించి మాట్లాడారు. వందలమంది ఆత్మబలిదానాలతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని, రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌ను, సహకరించిన బీజేపీని కాదని టీఆర్‌ఎస్‌కు ప్రజలు రెండు పర్యాయాలు పట్టం కడితే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. ప్రజల మాదిరిగానే సీఎం కేసీఆర్, కేటీఆర్‌లను నమ్మానన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సక్రమంగా ఇస్తున్నారా? రైతులు పడుతున్న గోస కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి హామీ ఏమైందని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టినవెన్ని, పేదలకు ఇచ్చింది ఎన్ని? లెక్కలు చూసుకోవాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున నామమాత్రంగా పోడు పట్టాలు ఇచ్చే ఎన్నికల స్టంట్ వద్దని, సీఎం కేసీఆర్ హామీ మేరకు పోడుపట్టాలు చిత్తశుద్ధితో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కోరం కనకయ్య, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, జారే ఆదినారాయణ, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, బాణోత్ పార్వతి, భోజ్యానాయక్, నరకుళ్ల సత్యనారాయణ, దెవుల చందర్‌రావు, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో ఉండేందుకే క్యాంపు కార్యాలయాలు

అన్నపురెడ్డిపల్లి: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాలలో పాలు పంచుకునేందుకే క్యాంపు కార్యాలయాలు ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఆయన అనుచరుడు పర్సా వెంకటేశ్వరరావు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన క్యాంపు కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2019లో టికెట్ ఇవ్వకపోయినా ప్రజల మధ్యే ఉంటున్నానని, అధికారం ఉన్నా లేకపోయినా ప్రజలతో మమేకం కావాలనే లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అని మండలాల్లో, మున్సిపాటీల్లో క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. పదవులు ఉన్నా లేకున్నా.. అధికారం ఉన్నా, లేకపోయినా.. తనకు ప్రజలే ముఖ్యమని, ప్రజల కోసం పనిచేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్సా వెంకటేశ్వర్లు, బోడా పద్మ, భీంరెడ్డి శ్రీనివాసరెడ్డి, దుబ్బాకుల రాము, మారకాల లక్ష్మారెడ్డి, పీరబాయిన నాగేశ్వరరావు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి, శిక్షణపై దృష్టి సారించాలి


సర్టిఫికెట్లు అందిస్తున్న డైరెక్టర్ లక్ష్మి

పాల్వంచ: మహిళలు ఉపాధి శిక్షణపై దృష్టి సారించాలని యాదాద్రి భువనగిరి శ్రీరామ నంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక నవ లిమిటెడ్ మహిళా సాధికార కేంద్రంలో టైలరింగ్ ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆమె సర్టిఫికెట్లు అందించి ప్రసంగించారు. వృత్తి విద్యా కేంద్రం అందుబాటులో ఉండటం సువర్ణ అవకాశమని, అధునాతన పరికరాలు ఇతర శిక్షణ కేంద్రాల్లో ఎక్కడా లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవ లిమిటెడ్ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ డి.శ్యాంసుందర్, డాక్టర్ విహారికృష్ణ, కిశోర్, లలిత, అరుణ, వాసవి రాణి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు


అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

అశ్వారావుపేటరూరల్: ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని, ఇలాంటి చర్యలకు పాల్పడి తమ విలువైన జీవితాలను పాడు చేసుకోవద్దని పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం సీనియర్ విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులను ప్రేమించాలని, గురువులను గౌరవిస్తూ ఆశయాలను సాధించుకోవాలన్నారు. విద్యార్థులు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని, చెడు వ్యసనాలకు లోను కాకుండా కచ్చితమైన ప్రణాళికతో లక్ష్యాలను అందుకోవాలని సూచించారు. ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థులను వేధిస్తే చట్టపరంగా కఠినమైన చర్యలుంటాయని, పలు కేస్ స్టడీలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ వెంకన్న, ఎస్ఐ రాజేశ్‌కుమార్, ప్రొఫెసర్లు మధుసూదన్‌రెడ్డి, గోపాలకృష్ణమూర్తి, శిరీష, జమయ్య, రమేశ్, రెడ్డిప్రియ, స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి: పురుగులమందు తాగి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన కాలసాని రత్నకుమారి (28) మతిస్థిమితం లేకపోవడంతో కొంతకాలంగా తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొలానికి కొట్టే పురుగులమందు తాగింది. గమనించిన తల్లిదండ్రులు 108 వాహనంలో కొత్తగూడెం తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందిందని వారు తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి సోదరుడు వీరరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షాహిన తెలిపారు.

అప్పులబాధతో రైతు..

జూలూరుపాడు: అప్పులబాధ తాళలేక మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య కథనం ప్రకారం.. మండలంలోని సాయిరాంతండాకు చెందిన తేజావత్ రాంబాబు (25) తనకు ఉన్న 3 ఎకరాల భూమితోపాటు మరో ఎకరం కౌలుకు తీసుకొని మిర్చి, పత్తి పంటలను సాగు చేశాడు. మిర్చి పంటకు తెగుళ్లు సోకడంతో తీవ్రంగా నష్టపోయాడు. పంటల పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 24న రాంబాబు పొలానికి వెళ్లి వస్తానని భార్యకు చెప్పి వెళ్లి పురుగులమందు సేవించాడు. అదే గ్రామానికి చెందిన గుగులోత్ నరసింహా పొలం పనుల నిమిత్తం అటుగా వెళ్తుండగా రాంబాబు అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని గమనించి, కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు వచ్చి రాంబాబును ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య తెలిపారు.

వృద్ధురాలి ప్రాణం తీసిన సొరకాయ

కొత్తగూడెంరూరల్: బిల్డింగ్‌పైన కాసిన సొరకాయను కోసేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి వృద్ధురాలు మరణించిన ఘటన హేమచంద్రాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని హేమచంద్రాపురం గ్రామానికి చెందిన మేకల భారతమ్మ (65) (తన కుమారుడి ఇంట్లో ఉంటోంది) ఇంటి డాబాపైన సొరకాయ కాసింది. దానిని కోసేందుకు డాబాపైకి ఎక్కుతుండగా మెట్ల పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

టీచర్‌గా మారిన డీఈఓ


గణితం బోధిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

అశ్వారావుపేటరూరల్: ఆయన జిల్లా విద్యాశాఖాధికారి.. అయినప్పటికీ కొద్ది సేపు విద్యార్థులకు పాఠాలు బోధించి టీచర్‌గా మారిపోయారు. అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం డీఈఓ సోమశేఖరశర్మ ఆకస్మికంగా సందర్శించారు. పదోవ తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి పలు పాఠ్యాంశాలపై ప్రశ్నించారు. ఆ తర్వాత తానే టీచర్‌గా మారిపోయి బ్లాక్ బోర్డుపై విద్యార్థులకు గణిత బోధన చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. కష్టపడి, ఇష్టంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. అనంతరం మన ఊరు – మన బడి పనులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంటకాలను రుచి చూశారు. ఆయనతోపాటు ఎంఈఓ పి.కృష్ణయ్య, పరీక్షల విభాగం ఏసీజీఈ మాధవరావు, సెక్టోరియల్ అధికారులు నాగరాజశేఖర్, సతీశ్ ఉన్నారు.

జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

కొత్తగూడెంఅర్బన్: కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ శేతామహంతి రాష్ట్రవ్యాప్తంగా డీఎంహెచ్‌ఓలతో శనివారం జూమ్ సమావేశం నిర్వహించారు. ఇందులో డీఎంహెచ్‌ఓ శిరీష పాల్గొని మాట్లాడారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, పల్లె, బస్తీ దవాఖానాలు, సబ్ సెంటర్ బిల్డింగ్‌లు, చైల్డ్ హెల్త్.. తదితర అంశాలపై వివరాలను కమిషనర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టీబీకి సంబంధించి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్‌ను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఎస్ఆర్‌సీ, ఎస్ఎన్‌సీయూ, ఎన్‌బీఎస్‌యూ డేటా, ఇమ్యూనైజేషన్‌కు సంబంధించి మీజిల్స్ కోసం ఇంటింటి సర్వే నిర్వహించి 6 నెలల నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి వారికి ఎంఆర్, ఎంఆర్–2 ఇప్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ నందిత, సుధీర, రాజేశ్, ప్రోగ్రాం అధికారులు మణికంఠారెడ్డి, చైతన్య, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థుల జాబితా విడుదల

కొత్తగూడెంఅర్బన్: ఎంఎల్‌హెచ్‌పీ సరికొత్త అభ్యర్థుల జాబితాను జిల్లా వెబ్‌సైట్‌లో, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నోటీసు బోర్డులో ఏర్పాటు చేశామని డీఎంహెచ్‌ఓ శిరీష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 27వ తేదీన 10.30 గంటలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడిగా జోగేశ్వరరావు

దమ్మపేట : రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడిగా దమ్మపేట పీఏసీఎస్ చైర్మన్ రావు జోగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి శనివారం ఆదేశాలు జారీ చేశారు. కాగా తనను ఈ పదవిలో నియమించిన రాజేశ్వరరెడ్డితో పాటు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు జోగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

తండ్రీ కొడుకులపై కేసు

పాల్వంచరూరల్: డబ్బులు అడగడానికి వెళ్తే గొడవపడి చంపుతామని బెదిరించారని మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన పల్లపు ఎల్లమ్మ అదే గ్రామానికి చెందిన ఐలయ్య, అతని కుమారుడు జంపయ్యను డబ్బులు అడగడానికి శనివారం వాళ్ల ఇంటికి వెళ్లింది. దీంతో వారు గొడవపడి తనను చంపుతామని బెదిరించారని, వారి నుంచి ప్రాణభయం ఉందని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తండ్రి కొడుకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.


కల్లంలో ఆరబోసిన మిర్చి అపహరణ

మధిర: మండలంలోని మడుపల్లిలో కల్లంలో ఆరబోసిన మిర్చిని శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. రైతు కర్నాటి వేణుగోపాల్‌రెడ్డి మిర్చిని కల్లంలో ఆరబోసిన శుక్రవారం రాత్రి కుప్ప చేశాడు. ఆయన ఇంటికి వెళ్లిపోయాక గుర్తుతెలియని వ్యక్తులు వాహనంలో వచ్చి సుమారు రూ.1.50 లక్షల విలువైన ఎనిమిది క్వింటాళ్ల తేజ మిర్చిని తీసుకెళ్లారు. ఘటనపై మధిర టౌన్ పోలీసులకు బాధిత రైతు శనివారం ఫిర్యాదు చేశాడు.

రైతు ఇంట్లో పత్తి...

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని గోల్‌తండాలో ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తిని శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రైతు రావుల విజయ్‌పాల్‌రెడ్డి ఇంట్లో పత్తిని నిల్వ చేసి, రాత్రి మిర్చి కల్లంవద్ద కాపలాకు వెళ్లాడు. ఆయన కుటుంబీకులు నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని దుండగులు ఆటోలో వచ్చి ఇంటి వరండాలోని సుమారు 10 క్వింటాళ్ల పత్తిని ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని శనివారం గుర్తించిన విజయపాల్‌రెడ్డి ఎస్ఐ వరాల శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశాడు.

కలకలం రేపిన క్షుద్రపూజలు


క్షుద్రపూజల పేరుతో తీసిన గొయ్యి, పూజా సామగ్రి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడు రెండేళ్ల కిందట హిజ్రాగా మారాడు. అతడి తల్లి తన కొడుకును హిజ్రా నుంచి తిరిగి సాధారణ స్థితికి మార్చుకోవాలని భావించి క్షుద్రపూజలు చేసేవారిని ఆశ్రయించింది. దాంతో సదరు వ్యక్తులు హిజ్రాగా మారిన వ్యక్తిని బాగు చేస్తామని శుక్రవారం అర్ధరాత్రి ఆమె ఇంట్లోనే క్షుద్రపూజలు చేశారు. దాంట్లో భాగంగానే ఇంట్లోనే ఓ పెద్ద గొయ్యి తీసి, గుప్త నిధులు కూడా ఉన్నాయని, వీటిని బయటకు తీసేందుకు పూజలు చేయాల్సి ఉంటుందని సదరు మహిళను నమ్మించారు. గుప్త నిధుల కోసం అమావాస్య రోజున చేసే ఈ పూజలకు 150 గ్రాముల దాకా బంగారు ఆభరణాలను పెట్టాలని, బంగారు ఆభరణాలను సిద్ధం చేసుకోవాలని ఆ మహిళను నమ్మించి వెళ్లిపోయారు. కొంత ఆలస్యంగా విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ బి.రాజేశ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాధిత మహిళను పోలీసులు మూఢ నమ్మకాలు, క్షుద్ర పూజల పేరుతో మోసం చేస్తారని అవగాహన కల్పించారు. కాగా గ్రామంలో క్షుద్ర పూజలు, గుప్త నిధుల తవ్వకాలపై విస్తృతంగా ప్రచారం జరగడంతో స్థానికులంతా భయాందోళనకు గురయ్యారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కందుల ప్రతాప్‌రెడ్డి ఈ నెల 12వ తేదీన ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఏఎస్ఐ సత్యనారయణ వివరాలు వెల్లడించారు. ప్రతాప్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మిర్చి, పత్తి పంటల్లో తీవ్ర నష్టం వాటిల్లడంతో మనోవేదనకు గురై ఈ నెల 12వ తేదీన ఇంట్లో పరుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు వినోద్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి

జూలూరుపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఈసం పాపయ్య (64) పాలు పితుకుతుండగా ఆవు కాలితో తన్నడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ తిరుపతిరావు కథనం ప్రకారం.. రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఈసం పాపయ్య పాలు పితుకుతుండగా ఆవు కాలితో ఎగిరి తన్నడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు పాపయ్యను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పాపయ్య శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఈసం రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తిరుపతిరావు పేర్కొన్నారు.

రెండో రోజుకు చేరిన నిరసన


నిరసన తెలుపుతున్న బీటీపీఎస్ ఉద్యోగులు

మణుగూరురూరల్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో బీటీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన నిరసన రెండో రోజుకు చేరుకుంది. శనివారం ఉద్యోగులు చీఈ జనరల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. జెన్‌కో యాజమాన్య నిర్లక్ష్యం వల్లే పీఆర్‌సీ ప్రకటనలో జాప్యం జరుగుతోందని చెప్పారు. యాజమాన్యం తక్షణమే స్పందించి పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌పీఈ జేఏసీ బీటీపీఎస్ రీజియన్ కన్వీనర్ ఎస్.శ్రీనివాసరెడ్డి, నాయకులు వి.ప్రసాద్, రవిప్రసాద్, సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, వీరస్వామి, రాజబాబు, దయాకర్, కె.నర్సింహారావు, అల్తాఫ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ గార్డుపై దాడి

కొత్తగూడెంటౌన్: సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని ఇంటెలిజెన్స్ విభాగంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కుక్కల నర్సింగరావుపై నాజర్ అనే వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకోగా వన్‌టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కార్పొరేట్ ఏరియాలో సెకండ్ షిఫ్ట్‌లో మెయిన్ హాస్పిటల్ ఏరియాలో విధులు ముగించుకుని రాత్రి 10.30 గంటలకు క్యాజువాలిటీలో కేసుల విషయమై డాక్టర్, స్టాఫ్ నర్సును ఆరాతీశారు. తిరిగి ఇంటి వెళ్దామని తన ద్విచక్రవాహనం వద్దకు వెళ్లగా అదే సమయంలో రామాంజేయ కాలనీకి చెందిన బలగం వివేక్ బండిపై కూర్చుని ఉన్నాడు. తాను ఇంటికి వెళ్లాలని.. బైక్ మీద నుంచి దిగాలని సూచించాడు. పక్కనే ఉన్న నాజర్ అనే వ్యక్తి 10 నిమిషాలు ఆగలేవా.. అంటూ బూతులు తిడుతూ చెంపపై కొట్టాడని, చంపుతానని బెదిరించాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వివాదంపై ఇంటెలిజెన్స్ ఆరా

కొత్తగూడెంఅర్బన్: వివాహితుడైన ఓ ఎస్ఐ ప్రేమ పేరుతో యువతిని మోసం చేశాడనే ఆరోపణలపై ఇంటెలిజెన్స్ విభాగం శనివారం ఆరా తీయడం మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. కొత్తగూడెం పట్టణ పరిధిలోని ఓ ఎస్ఐ పాల్వంచకు చెందిన ఓ యువతిని ప్రేమ పేరుతో మోసం చేసిన విషయం ఇటీవల సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అయితే, ఈ తతంగంలో ఎస్ఐ తనకు వివాహం అయినా కూడా యువతిని ప్రేమ పేరుతో మోసం చేయడంపై సర్వత్రా విమర్శలు చెలరేగాయి. కాగా, ఇదే ఎస్ఐపై వ్యక్తిగత ఆరోపణలతో పాటుగా విధి నిర్వహణపై కూడా కొన్ని ఆరోపణలు తెరపైకి రావడం మరోకోణం.

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి గుర్తింపు

కారేపల్లి: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి వివరాలు వెల్లడయ్యాయి. కారేపల్లిలోని పేరుపల్లి రైల్వే గేట్ సమీపాన శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. కాగా, మృతుడు ఏన్కూర్ మండలం రేపల్లేవాడకు చెందిన మార్కపూడి నరసింహారావు(40)గా స్థానికులు గుర్తించారు. కారేపల్లికి చెందిన నాగబెల్లి ప్రభాకర్ బావమరిది అయిన నరసింహారావు కొంతకాలంగా కుటుంబ కలహాలతో ఇబ్బంది పడుతుండగా, కారేపల్లి వచ్చిన ఆయన రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, ఘటనపై శనివారం కేసు నమోదు చేసిన డోర్నకల్ రైల్వే పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

స్నేహితుడిని కత్తితో పొడిచి.. తల, గుండె వేరు చేసి..

- తాను ప్రేమించిన యువతికి దగ్గరవుతున్నాడన్న కక్షతో యువకుడి దుర్మార్గం
- పథకం ప్రకారం పిలిపించి.. హత్యచేసిన ఇంజనీరింగ్ విద్యార్థి

అబ్దుల్లాపూర్‌మెట్/కల్వకుర్తి టౌన్/ చారకొండ/ ఎంజీయూ (నల్లగొండ రూరల్)/ నార్కట్‌పల్లి: అతను స్నేహితుడు.. కానీ తాను ప్రేమించిన యువతికి దగ్గర అవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు.. మనసులో కక్ష పెంచుకున్నాడు.. ఫ్రెండ్స్‌తో గెట్ టుగెదర్ ఉంది రమ్మని పిలిచాడు.. నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో పొడిచి చంపేశాడు.. తర్వాత గుండె, తల, మొండెం, కాళ్లు చేతులను వేరుచేసి.. వాటి ఫొటోలను వాట్సాప్ ద్వారా ప్రియురాలికి పంపి పైశాచికానందం పొందాడు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో శనివారం ఆలస్యంగా వెలుగు చూసిన దారుణ ఘటన ఇది. హతుడు, నిందితుడు ఇద్దరూ స్నేహితులు, ఇంజనీరింగ్ విద్యార్థులు కావడం, ప్రేమ విషయం హత్యకు దారితీయడం కలకలం రేపింది.

ఇంటర్ నుంచీ స్నేహితులు..

పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని వంకరాయి తండాకు చెందిన సేనావత్ శంకర్ కుమారుడు సేనావత్ నవీన్ (20), వరంగల్‌కు చెందిన పేరాల ప్రభాకర్ కుమారుడు పేరాల హరిహరకృష్ణ (21) ఇద్దరూ స్నేహితులు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడీఎల్ కాలేజీలో కలిసి ఇంటర్ చదివారు. తర్వాత హరిహరకృష్ణ పీర్జాదిగూడలోని అరోరా కళాశాలలో.. నవీన్ నార్కట్‌పల్లిలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ బీటెక్‌లో చేరారు. అయినా తమ స్నేహాన్ని కొనసాగిస్తూ వచ్చారు. అయితే ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడే హరిహరకృష్ణ ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. నవీన్ కూడా అదే యువతిని ఇష్టపడ్డాడు. సదరు యువతి కూడా కొంతకాలం నుంచి తనను దూరం పెడుతూ నవీన్‌తో చనువుగా ఉండటాన్ని హరిహరకృష్ణ జీర్ణించుకోలేకపోయాడు. నవీన్‌ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయానికి వచ్చాడు.

ముందుగానే ప్లాన్ చేసుకుని..

నవీన్‌ను అంతమొందించాలని రెండు నెలల నుంచే ప్లాన్ చేసుకున్న హరిహరకృష్ణ.. ఈ నెల 17న ఇంటర్ ఫ్రెండ్స్ గెట్ టు గెదర్ ఉందని, రావాలని నవీన్‌కు ఫోన్ చేశాడు. ఇది నమ్మిన నవీన్ యూనివర్సిటీ నుంచి హైదరాబాద్‌కు వచ్చి హరిహరకృష్ణను కలిశాడు. కాసేపు ఇద్దరూ బైక్‌పై కలిసి తిరిగారు. సాయంత్రం మద్యం తీసుకుని బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లారు. మద్యం తాగుతూ మాట్లాడుకున్నారు. ఈ సమయంలో ప్రేమించిన యువతి విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అప్పటికే ప్లాన్ ప్రకారం పదునైన కత్తి తెచ్చుకున్న హరిహరకృష్ణ దానితో దాడి చేశాడు. మద్యం మత్తులో ఉన్న నవీన్ దీనిని ప్రతిఘటించలేకపోయాడు. తీవ్ర ఆవేశంలో ఉన్న హరిహరకృష్ణ కత్తితో నవీన్ తలను, కాళ్లు, చేతులు, ప్రైవేట్ పార్ట్స్‌ను కోసి ముక్కలు చేశాడు. ఛాతీ భాగాన్ని చీల్చి గుండెను బయటికి తీశాడు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయాడు.


నిందితుడు హరిహర కృష్ణతో జీవన్ (సర్కిల్‌లో)

మరో స్నేహితుడి ఇంటికి వెళ్లి.. స్నానం చేసి..

నవీన్‌ను హత్య చేసిన తర్వాత హరిహరకృష్ణ నేరుగా హసన్ అనే మరో స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. కాస్త టెన్షన్‌గా కనిపించడంతో ఏం జరిగిందని హసన్ ప్రశ్నించినా ఏమీ లేదంటూ.. బాత్రూంలోకి వెళ్లి స్నానం చేసిన వచ్చాడు. తర్వాత హత్య గురించి హసన్‌కు చెప్పాడు. దీనితో భయపడిన హసన్ వెంటనే వెళ్లి పోలీసులకు లొంగిపోవాలని సూచించగా.. తెల్లారాక వెళ్తానని చెప్పి, అక్కడే నిద్రపోయాడు. మరునాడు మూసారాంబాగ్‌లోని తన సోదరి మమత ఇంటికి వెళ్లాడు. నాలుగైదు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్నాడు.

ఏమీ తెలియనట్టు నటిస్తూ..

ఈ నెల 16న యూనివర్సిటీ నుంచి బయటికి వచ్చినప్పటి నుంచీ నవీన్ ఆచూకీ తెలియకపోవడంతో.. అతడి కుటుంబ సభ్యులు గాలించడం మొదలుపెట్టారు. హరిహరకృష్ణను కలిసి ఏం జరిగిందని నిలదీశారు. అయితే ఓ యువతి విషయంలో తమ మధ్య గొడవ జరిగినది నిజమేనని, కానీ తర్వాత ఇద్దరం కలుసుకున్నామని హరిహరకృష్ణ చెప్పాడు. నవీన్ నార్కట్‌పల్లికి వెళ్తానంటే విజయవాడ జాతీయ రహదారిపై దింపేసి తాను హైదరాబాద్‌కు వెళ్లిపోయానని వివరించాడు. నవీన్ కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం రాకుండా అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నప్పుడువారి వెంటే ఉంటూ నమ్మించాడు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించేందుకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు కూడా వచ్చాడని నవీన్ స్నేహితులు తెలిపారు.

అన్నివైపులా ఒత్తిడి పెరగడంతో..

నాలుగైదు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్న హరిహరకృష్ణ తర్వాత విశాఖపట్నంతోపాటు పలు ప్రాంతాల్లో తిరిగాడు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చి ప్రియురాలికి ఫోన్ చేసి పిలిపించుకుని మాట్లాడాడు. నవీన్‌ను హత్య, ఇతర అంశాలను ఆమెకు వివరించగా.. పోలీసులకు లొంగిపోవాలని ఆమె చెప్పినట్టు తెలిసింది. మరోవైపు హరిహరకృష్ణను కలవడానికి వెళ్లిన నవీన్ ఆచూకీ లేకపోవడం, హరిహరకృష్ణ ఫోన్ కూడా స్విచాఫ్ వస్తుండటంతో.. నవీన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరిహరకృష్ణ కుటుంబ సభ్యులనూ ప్రశ్నించారు. ఇలా అన్నివైపులా ఒత్తిడి రావడంతో హరిహరకృష్ణ శుక్రవారం అర్ధరాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. పోలీసులు అతడిని శనివారం రాత్రి హయత్‌నగర్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు తెలిసింది. కాగా.. నవీన్ హత్యకు హరిహరకృష్ణ ఒక్కడే పాల్పడ్డాడా, మరెవరైనా ఉన్నారా అన్నకోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నవీన్ హత్యకు గురైన రోజు హరిహరకృష్ణతోపాటు మరో స్నేహితుడైన జీవన్ కూడా తన బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ వరకు వచ్చినట్టు తెలిసింది. అతను వెళ్లిపోయాక హత్య జరిగిందా? కలిసే హత్య చేశారా అన్నదానిపై ఆరా తీస్తున్నారు.

నవీన్ కుటుంబ సభ్యుల ఆందోళన

నిందితుడు హరిహరకృష్ణను కఠినంగా శిక్షించాలంటూ నవీన్ కుటుంబ సభ్యులు, మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ అక్కడికి చేరుకుని.. నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దొరకకుండా జాగ్రత్తపడి..

నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ ఆధారాలు దొరకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహంపై డ్రెస్‌ను తొలగించి దూరంగా పడేశాడని.. హత్యచేసి, శరీర భాగాలను కోసిన సమయంలో చేతులకు గ్లౌజులు వేసుకున్నాడని వివరించారు. అలాగే ఎలాంటి ఆధారాలు దొరక్కుండా తనకు చెందిన రెండు ఫోన్లలోని డేటా మొత్తాన్ని తొలగించినట్టు సమాచారం.

20 మీటర్లకు ఓ ముక్క.. యువతికి వాట్సాప్‌లో ఫొటోలు!

పోలీసులు లొంగిపోయిన హరిహరకృష్ణను ఘటనా స్థలానికి తీసుకెళ్లి విచారించారు. మద్యం మత్తులోనే నవీన్‌ను హత్య చేసినట్టు ప్రాథమిక విచారణలో గుర్తించారు. నవీన్ శరీరాన్ని ముక్కలుగా చేశాక.. 20 మీటర్లకో భాగాన్ని దూరదూరంగా పారేసినట్టు తేల్చారు. ఆ భాగాలను పోలీసులు సేకరించి ఫోరెన్సిక్ పరిశీలనకు పంపించారు. ఇక నవీన్‌ను కిరాతకంగా చంపిన హరిహరకృష్ణ.. అతడి శరీర భాగాలను ఫొటోలు తీసి ప్రేమించిన యువతికి, పలువురు ఇంటర్ స్నేహితులకు వాట్సాప్ ద్వారా పంపినట్టు తెలిసింది.

పథకం ప్రకారమే హత్య

నవీన్ హత్య పథకం ప్రకారమే జరిగినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. నిందితుడు తన వెంట పదునైన కత్తిని తీసుకుని వచ్చాడంటే అది క్షణికావేశంలో జరిగిన హత్యగా కనిపించడం లేదు. కొంతకాలంగా నవీన్‌పై హరిహరకృష్ణ పెంచుకున్న పగే ఈ హత్యకు దారితీసినట్టు తెలుస్తోంది. దర్యాప్తులో అన్ని విషయాలు తేలుస్తాం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తాం.

– సాయిశ్రీ, డీసీపీ ఎల్బీనగర్

విషాదంలో వంకరాయి తండా

నవీన్ హత్య విషయం తెలియడంతో అతడి స్వగ్రామం వంకరాయితండాలో విషాదం అలుముకుంది. నవీన్ తండ్రి శంకర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి వసంత కూలిపనులకు వెళ్తుంది. గ్రామం నుంచి కల్వకుర్తికి వలస వచ్చిన వారిద్దరూ.. కష్టపడి పనిచేస్తూ కుమారుడిని ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. మంచి ఉద్యోగం సంపాదించి కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కుమారుడు దారుణంగా హత్యకు గురికావడంతో కన్నీటిలో మునిగిపోయారు. పోలీసులు శనివారం సాయంత్రం నవీన్ మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాత్రికి వంకరాయితండాలో అంత్యక్రియలు నిర్వహించారు.


నవీన్ స్వగ్రామం వంకరాయి తండాలో విషాదఛాయలు

మల్లన్న సేవలో సీజేఐ

శ్రీశైలం టెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ధనుంజయ వై చంద్రచూడ్, కల్పనా దాస్ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, సత్యప్రభ దంపతులు శనివారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో లవన్న, అర్చక స్వాములు ఆలయ మర్యాదలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం సీజేఐ దంపతులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి దంపతులు రత్నగర్భ స్వామిని, తర్వాత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. మల్లికా గుండంలో ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని, భ్రమరాంబాదేవి అమ్మ వారిని దర్శించుకున్నారు. వీరి వెంట మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులు ఉన్నారు.


ఆలయం వద్ద సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కి స్వాగతం పలుకుతున్న దేవస్థానం చైర్మన్ తదితరులు

పరిశ్రమల చూపు ఏపీ వైపు

- 44 నెలల్లో వాస్తవ రూపంలోకి రూ.75,649.77 కోట్ల పెట్టుబడులు
- ఇందులో భారీ, మెగా యూనిట్ల రూపేణా రూ.56,534.53 కోట్లు

సాక్షి, అమరావతి: పెట్టుబడులు పెట్టేందుకు దేశంలోని దిగ్గజ సంస్థలు పారిశ్రామిక అనుకూల విధానాలున్న ఏపీ వైపు చూస్తున్నాయి. ఇప్పటికే టాటా, బిర్లా, ఆదానీ, ఆర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, బంగర్ లాంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడులు పెట్టడానికి అనేక దిగ్గజ సంస్థలు ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఢిల్లీతో పాటు బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్ వంటి పట్టణాల్లో నిర్వహించిన రోడ్‌షోలకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన వచ్చింది.

14,36,992 మందికి ఉపాధి

సీఎంగా జగన్ పగ్గాలు చేపట్టాక 2019 జూన్ నుంచి 2023 జనవరి వరకు రూ.75,649.77 కోట్ల విలువైన పెట్టుబడులు (ఎంఎస్ఎంఈ సహా) వాస్తవ రూపంలోకి వచ్చాయి. ఇందులో 111 భారీ, మెగా యూనిట్లు రూ.56,534.53 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి ప్రారంభించాయి. వీటి ద్వారా 73,876 మందికి ఉపాధి లభించింది. అంటే సగటున ఏడాదికి రూ.15,418 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి మొదలైంది. ఇందులో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా రూ.13,766 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఆరు యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమైంది. వీటి ద్వారా 15,040 మందికి ఉపాధి లభించింది. ఇవి కాకుండా రూ.7,305 కోట్ల విలువైన కియా పరిశ్రమ వాణిజ్య పరమైన ఉత్పత్తిని కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2019 డిసెంబర్ 5న లాంఛనంగా ప్రారంభించారు. వీటికి అదనంగా ఎంఎస్ఎంఈ రంగంలో 1,52,558 కొత్త యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.19,115.24 కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా 13,63,706 మందికి ఉపాధి లభించింది. ఇవికాకుండా మరో 86 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,35,125.60 కోట్ల విలువైన పెట్టుబడులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవి కూడా వాస్తవ రూపంలోకి వస్తే 2,36,806 మందికి ఉపాధి లభించనుంది.

ప్రకృతి సాగులో ఏపీ ఆదర్శం

కేంద్రం ప్రశంసలు.. సామాజిక ఆర్థిక సర్వేలో ప్రస్తావన

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏపీలో ఉద్యమంలా సాగుతున్న ప్రకృతి వ్యవసాయానికి అరుదైన గౌరవం దక్కింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఇటీవల విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వేలో ఏపీలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రశంసించింది. అన్ని రాష్ట్రాలూ ఏపీని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించింది. తొలుత 704 గ్రామాల్లో 40 వేల మందితో ప్రారంభమైన ప్రకృతి సాగు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఓ ఉద్యమంలా రూపుదిద్దుకొంది. ప్రస్తుతం 3,730 గ్రామాల్లో 6.30 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రైతులు కాకుండా ఈ ఉద్యమంలో ఇప్పటివరకు 1.32 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వాములయ్యారు. 1.71 లక్షల మంది పేద, మధ్య తరగతుల ప్రజలు ఇళ్లలో కిచెన్ గార్డెన్లను పెంచుతున్నారు. ఏపీ స్ఫూర్తితో ఈ ఏడాది జాతీయ స్థాయిలో కోటి ఎకరాల్లో ప్రకృతి సాగుకు కేంద్రం చర్యలు చేపట్టింది.

ఖమ్మంలో రీజియన్ టౌన్ ప్లానింగ్ అధికారులు


మేయర్ నీరజను సన్మానిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారుల బృందం

ఖమ్మంమయూరిసెంటర్: వరంగల్ రీజియన్ పరిధిలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ ఖమ్మం జిల్లాల మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల టౌన్ ప్లానింగ్ అధికారులు రీజినల్ డైరెక్టర్ మైఖేల్ ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలో పర్యటించారు. ఈ సందర్భంగా నూతన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనం, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, గోళ్లపాడు చానల్ పార్కులు, బల్లేపల్లి వైకుంఠధామం, లకారం ట్యాంక్‌బండ్‌తో పాటు పలు కూడళ్లను పరిశీలించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ ఖమ్మంలో జరిగిన అభివృద్ధి పనులను వారికి వివరించారు.

చికిత్స కోసం వచ్చి.. బస్టాండ్‌లో మృతి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కొత్త బస్టాండ్‌లో శనివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారానికి చెందిన మంచిన లింగయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స కోసం బంధువులు ఖమ్మం తీసుకొచ్చారు. ఈమేరకు కొత్త బస్టాండ్‌లో బస్సు దిగాక ఆయన కుర్చీలో కూర్చుంటుండగానే కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో బంధువులు ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

పర్ణశాలలో పనులను పరిశీలించిన ఈఓ


పనులను పరిశీలిస్తున్న ఈఓ రమాదేవి

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న పనులను భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి శనివారం పరిశీలించారు. ఆలయంలో ఆదివారం నుంచి రాజగోపురం, విశ్రాంతి మండపం, ఉపాలయాలకు శిఖర ప్రతిష్ఠాపన పూజలు జరగనున్నాయి. ఈ మేరకు పనులను పరిశీలించిన ఈఓ ఏర్పాట్లపై ఉద్యోగులకు సూచనలు చేశారు.

జిల్లా వార్తలు

డెడ్ స్టోరేజీ స్థాయికి పాలేరు

- పైనుంచి తగ్గుతున్న ఇన్‌ఫ్లో
- 13.60 అడుగులకు పడిపోయిన నీటిమట్టం
- దిగువకు నీటి విడుదల నిలిపేసిన అధికారులు



పాలేరు రిజర్వాయర్ ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ వద్ద పడిపోయిన నీటిమట్టం (ఇన్‌సెట్) రిజర్వాయర్ వద్ద పరిశీలిస్తున్న సీఈ శంకర్‌నాయక్, అధికారులు

ఖమ్మంఅర్బన్/కూసుమంచి: ఖమ్మం జిల్లాలో ప్రధాన నీటి వనరు అయిన సాగర్ జలాలు నానాటికీ తగ్గుముఖం పడుతున్నాయి. జిల్లాలోని 17 మండలాల పరిధిలో సాగర్ నీటితోనే పంటలు సాగు చేస్తుండగా, గత కొన్నేళ్లుగా ఎదురుకాని ముప్పు ఈసారి ఎదురవుతోంది. ఓవైపు చివరి ఆయకట్టు నీరు అందడం లేదని రైతులు ఇప్పటికే ఆందోళనలు చేస్తుండగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ స్థాయికి చేరింది. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో అధికారులు మిషన్ భగీరథకు నీటి విడుదల కొనసాగిస్తూనే రిజర్వాయర్ ఔట్‌ఫాల్ రెగ్యులేటర్‌ను శనివారం మూసేశారు.

ఇన్‌ఫ్లో సగానికి పైగా కోత

సాగర్ ప్రధాన కాల్వ నుండి జిల్లా ఆయకట్టుకు రావాల్సిన ఇన్‌ఫ్లోలో సగానికి పైగా కోత పడుతోంది. సాగర్ ప్రధాన కాల్వ నుంచి 11వేల క్యూసెక్కులకు బదులు 8,986 క్యూసెక్కుల నీటినే విడుదల చేస్తున్నారు. ఇందులో ఎగువ జిల్లాల్లో ఆయకట్టుకు వినియోగించుకున్నాక జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు రావాల్సిన 6,400 క్యూసెక్కుల్లో 2,918 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే నమోదవుతోంది. ఇక రిజర్వాయర్ నుండి ఆయకట్టుకు 2,740 క్యూసెక్కులు, పాలేరు కాలువకు 245 క్యూసెక్కులతో పాటు మిషన్ భగీరథకు 125.60 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యాన పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి 23అడుగులు కాగా, శనివారం సాయంత్రం 13.60అడుగులకు పడిపోయింది. దీంతో తప్పని పరిస్థితుల్లో అధికారులు మెయిన్ కెనాల్ రెగ్యులేటర్‌ను మూసేశారు. రెండు, మూడు రోజులు పరిస్థితులు పర్యవేక్షించాక నీటి సామర్థ్యానికి అనుగుణంగా మళ్లీ విడుదల చేస్తామని చెబుతున్నారు.

వారబందీకి తోడు మరికొన్ని రోజులు

జిల్లాలో సాగర్ జలాలను వారబందీ విధానంలో ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం నీటిమట్టం కనిష్ఠ స్థాయికి పడిపోయిన నేపథ్యాన వారబందీకి తోడు మరో నాలుగు రోజులు నిలిపివేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే, ఇప్పటికే మధిర, బోనకల్లు తదితర మండలాల పరిధిలో చివరి ఆయకట్టు రైతులు పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన బాట పడుతుండగా.. ఇప్పుడు మొత్తానికి నీటి విడుదల ఆపేస్తే ఎలా అనే ఆలోచనకు వచ్చినా తప్పని పరిస్థితుల్లో రెగ్యులేటర్‌ను మూసేశారు. అయితే, పైనుంచి ఇన్‌ఫ్లో పెరిగితే తప్ప సమస్యకు పరిష్కారం లభించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. కాగా, ఈ ఏడాది జలవనరుల శాఖ అధికారులు 2.18లక్షల ఎకరాలకు సాగునీరు అవసరమని ప్రతిపాదించగా.. అనధికారికంగా మరో 50 వేల ఎకరాలు పెరగడంతో సమస్య ఎదురవుతోందని తెలుస్తోంది. అంతేకాక విద్యుత్ సమస్యతో రైతులు బోర్లు, బావుల నీటిని వినియోగించుకోలేక సాగర్ నీటిపైనే ఆధారపడుతుండడం కూడా పాలేరు నీటిమట్టం తగ్గడానికి ఇంకో కారణమని చెబుతున్నారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం


సాగర్ ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. దీనికి తోడు ఎగువ ప్రాంతంలో వాడకం పెరగడంతో పాలేరు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తక్కువగా నమోదవుతోంది. ఈ నేపథ్యాన నీటి మట్టం కనిష్ఠ స్థాయికి చేరింది. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మిషన్ భగీరథ అవసరాలకు నీటి విడుదల నిలిపేసే పరిస్థితి లేదు. దీంతో రెగ్యులరేటర్‌ని మూసేశాం. ఒకటి, రెండు రోజులు నీటిని నిల్వ చేసి నీటిమట్టం పెరగగానే మళ్లీ విడుదల చేస్తాం.

– శంకర్‌నాయక్, సీఈ, జల వనరుల శాఖ

ఇనుగుర్తిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

కేసముద్రం: జన్మనిచ్చిన ఇనుగుర్తి గ్రామాన్ని జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో మండలంగా ఏర్పాటు చేయించగా.. వారి సహకారంతోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. శనివారం ఇనుగుర్తికి వచ్చిన ఆయన బాలికల వసతి గృహాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతో పాటు తాగునీటి అవసరాల కోసం రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అక్కడే విద్యార్థులతో కలిసి ఎంపీ భోజనం చేశారు. అలాగే, మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి పరిశీలించారు. అతర్వాత మన ఊరు–మన బడిలో భాగంగా తన తల్లిదండ్రులైన నారాయణ, వెంకటనర్సమ్మ జ్ఞాపకార్థం రూ.కోటి విరాళం ప్రకటించిన ఎంపీ స్థానిక హైస్కూల్‌ను పరిశీలించి చేయాల్సిన పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, తహసీల్దార్ దిలావర్, సర్పంచ్ దార్ల రామమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న పాల్గొన్నారు.


వసతి గృహం విద్యార్థినులతో భోజనం చేస్తున్న ఎంపీ రవిచంద్ర


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ వద్దిరాజు

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు బ్యాటరీ టెస్ట్

పాల్వంచరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కిన్నెరసాని(బాలురు), కాచనపల్లి(బాలికలు) మోడల్ స్కూళ్లతో పాటు హైదరాబాద్‌లోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో గిరిజన విద్యార్థులకు ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న బ్యాటరీ టెస్ట్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పాల్వంచ మండలం కిన్నెరసానిలో మోడల్ స్కూల్‌లో బ్యాటరీ టెస్ట్‌ను ఐటీడీఏ డీడీ.రమాదేవి ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 28వ తేదీ వరకు ఎంపిక పోటీలు జరుగుతాయని, గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, తొలిరోజు 85మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకాగా ఎత్తు, బరువు, క్రీడా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఐటీడీఏ క్రీడల అధికారి డాక్టర్ వీరూనాయక్ మాట్లాడుతూ తొమ్మిది అంశాల్లో బ్యాటరీటెస్ట్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని 40మందిని కిన్నెరసాని, 40మందిని కాచనపల్లి స్కూళ్లకు ఎంపిక చేస్తామని తెలిపారు. క్రీడా పాఠశాల హెచ్‌ఎం ఎస్.చందు, పీడీ ఎస్.సుబ్రమణ్యంతో పాటు ఎ.వెంకటేశ్వర్లు, నగేష్, బి.వెంకటేశ్వర్లు, మోతీలాల్, హరికృష్ణ, కృష్ణవేణి, రాంబాబు, నాగరాజు, వీరన్న, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల ఎత్తును పరిశీలిస్తున్న అధికారులు


క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చట్టం ఎదుట అందరూ సమానమే..

సీనియర్ సివిల్ జడ్జి సురేష్

మహబూబాబాద్ అర్బన్: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుని చట్టం ఎదుట అందరూ సమానమేనని తెలుసుకోవాలని మహబూబాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సురేష్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉచిత న్యాయ సాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఈసమావేశంలో టౌన్ ఎస్సై దీపికరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ భవాని, న్యాయవాది ఎస్.కే.పాషా, ఉపాధ్యాయులు హిమబిందు, విజయ, స్వర్ణలత, సృజన, స్వరూపరాణి, సంధ్య, కల్పనాదేవి, మంజుల, అరుణ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

సీతమ్మవారికి మంగళ సూత్రాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న పర్ణశాలలోని సీతమ్మ వారికి ఏపీకి చెందిన భక్తులు మంగళ సూత్రాలను శనివారం వితరణగా అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రామభక్త సమాజం బాధ్యులు 17 గ్రాముల బంగారంతో చేయించిన రూ.95 వేల విలువైన మంగళ సూత్రాలకు పూజల అనంతరం అధికారులకు అందించారు. అలాగే, స్వామి సన్నిధిలో జరిగే నిత్యాన్నదానానికి సికింద్రాబాద్‌కు చెందిన వి.ఉదయరాణి రూ.50 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


మంగళసూత్రాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న భక్తులు

వచ్చే నెల 9నుంచి జాతీయస్థాయి ఎడ్లపోటీలు

నేలకొండపల్లి: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో వచ్చేనెల 9 నుంచి 11వ తేదీ వరకు శ్రీ అంకమ్మ తల్లి జాతర జరగనుంది. 1961లో నిర్మించిన ఈ ఆలయ నిర్వహణ బాధ్యతలను కనమర్లపూడి సైదులు, అతర్వాత ఆయన కుటుంబీకులు చూస్తున్నారు. ఈ ఆలయంలో వచ్చే నెల 7నుంచి జరిగే జాతరలో భాగంగా 9, 10, 11వ తేదీల్లో జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకోసం కమిటీలను ఏర్పాటు చేసినట్లు బాధ్యులు వెల్లడించారు.